క్లుప్తంగా

అన్నదాతల హర్షం



కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న రైతులు

సిరిసిల్లటౌన్: ఎల్‌ఎం 4, ఎల్‌ఎం 5 కెనాల్ ద్వారా తంగళ్లపల్లి మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందించి పొలాలు ఎండిపోకుండా చూసిన అధికారుల కృషిపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, ఇరిగేషన్ ఈఈని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చిన్నలింగాపూర్, దాచారం, నరసింహులపల్లి రైతులు, మాజీ ఎంపీటీసీ బైరినేని రాము ఆధ్వర్యంలో అధికారులకు మెమొంటోలు అందించారు. పంటలకు నీళ్లు లేకుండా ఎండిపోతున్న తరుణంలో తమ గోడుపై వెంటనే స్పందించినందుకు జ్ఞాపికలు అందించినట్లు వెల్లడించారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



రూ.లక్ష చెక్కు అందిస్తున్న డాక్టర్ పెంచలయ్య, బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్

సిరిసిల్ల: పట్టణ బ్యాంకులో సేవింగ్ అకౌంట్ తీసి ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం చెక్కును మంగళవారం అందించారు. గాయత్రి బ్యాంకులో శ్రీరాముల రాజేశం నిర్భయ సేవింగ్ అకౌంట్ తీశారు. ప్రమాదంలో మృతిచెందడంతో భార్య దేవేంద్రకు రూ.లక్ష చెక్కును వేములవాడ ప్రాంతీయ వైద్యశాల పర్యవేక్షకుడు డాక్టర్ పెంచలయ్య చేతుల మీదుగా అందించారు. బ్రాంచ్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్, బ్యాంకు అధికారులు శ్రీకాంత్, జే.శరత్ కుమార్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రానికి చెందిన మహిళా రైతు ఎగదండి లక్ష్మీకి చెందిన గేదె ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందింది. సెస్ సంస్థ తరఫున నష్టపరిహారంగా రూ. 40వేలు మంజూరుకాగా చెక్కును లక్ష్మీకి అందించారు. సెస్ మండల డైరెక్టర్ నారాయణరావు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, మాజీ ఎంపీటీసీ స్వామి, నాయకులున్నారు.

బండి సంజయ్ ఆరోపణలు సిగ్గుచేటు

సిరిసిల్లటౌన్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాజీ సీఎం కేసీఆర్‌పై చేసిన ఆరోపణలు సిగ్గుచేటని జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్‌పై చేసిన దొంగనోట్ల ఆరోపణలకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కరీంనగర్ ప్రజలు తలదించుకునేలా చేస్తున్న చిల్లర రాజకీయాలు మానుకోవాలని సూచించారు. నాయకులు కుంభాల మల్లారెడ్డి, ఒజ్జెల అగ్గిరాములు, గజభీంకార్ రాజన్న, సబ్బని హరీశ్, చంద్రగౌడ్, ప్రేమ్‌కుమార్, షేక్ సికిందర్, కాసర్ల పవన్, పురుషోత్తం, సాయికిరణ్, జక్కుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ గ్రామస్తులు మంగళవారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్: మండలంలో బియ్యం అక్రమ నిల్వలపై పోలీసులు మంగళవారం రాత్రి దాడులు చేశారు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలల ప్రకారం.. మోహినికుంటలో డబుల్ బెడ్‌రూమ్ కాలనీలోని ఓ ఇంట్లో నిల్వ చేసిన 37 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ముస్తాబాద్ నుంచి ఆవునూర్‌కు ఆటోలో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పోతుగల్ వద్ద ఆటోను పట్టుకున్నారు. కాగా మోహినికుంటలో బియ్యం నిల్వ చేసిన వారిపై, ఇంటి యజమానిపై విచారణ చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

చందుర్తి: మండలంలోని రామరావుపల్లె గ్రామానికి చెందిన గంట కొమురయ్య వద్ద మంగళవారం రెండు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు చందుర్తి పోలీసులు తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సీజ్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

కోనరావుపేట: పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని మండల విద్యాధికారి మురళినాయక్ అన్నారు. మంగళవారం కనగర్తిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరుశాతం పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య, వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.



ప్రమాదకరంగా మర్రిపల్లి - మల్లారం రోడ్డు



నూకలమర్రిలో..

ప్రమాదకర మలుపులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వేములవాడ నుంచి హన్మాజిపేటకు వెళ్లే ప్రధాన రోడ్డు, వేములవాడ నుంచి నూకలమర్రికి వెళ్లే రోడ్డుతో పాటు వట్టెంల, ఇతర ప్రాంతాల్లో ఉన్న లింక్ రోడ్లు కొన్నేళ్లుగా ప్రమాదకరంగా మారాయి. ఈ మూలమలుపుల వద్ద రాత్రి సమయంలో వాహనాలు అదుపుతప్పి ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. గతేడాది అక్టోబర్ 14న హన్మాజిపేట శివారులో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో హన్మాజిపేటకు చెందిన విక్కుర్తి దిలీప్, సూర అనిల్ అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. గతనెల 16లో వేములవాడ నుంచి నూకలమర్రికి వెళ్లే ప్రధాన రోడ్డులో ఎదురుగట్ల వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనగా వేములవాడకు చెందిన చెర్ల ఆనంద్‌కుమార్, నూకలమర్రికి చెందిన జోగం శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాగా ఆనంద్‌కుమార్ చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రధాన మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, రోడ్డు ప్రమాదాలబారిన పడకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బండి సంజయ్‌ను విమర్శిస్తే సహించం



మాట్లాడుతున్న నాగుల శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: కేంద్ర మంత్రి బండి సంజయ్ మాజీ సీఎం కేసీఆర్‌పై చేసిన ఆరోపణలు ముమ్మాటికి నిజమేనని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్‌పై కాచిగూడ స్టేషన్‌లో దొంగనోట్ల కేసులో నిందితుడిగా కేసు నమోదైందన్నారు. మాజీ మంత్రి వి.హనుమంతరావు కూడా కేసీఆర్ రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పుడు దొంగనోట్ల దందాపై విచారణ చేపట్టాలని సిద్దిపేట సభలో కోరినట్లు తెలిపారు. సిరిసిల్లలో దొంగనోట్ల వ్యవహారంలో బీఆర్ఎస్‌కు చెందిన ఓ మాజీ కౌన్సిలర్ ఉన్నట్లు వచ్చిన వార్తలను గుర్తుచేశారు. బీఆర్ఎస్ అంటేనే మాఫియాలకు కేరాఫ్ అడ్రస్‌గా పేర్కొన్నారు. బండి సంజయ్‌ను విమర్శిస్తే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు దూడం శివప్రసాద్, గాజుల సదానందం, మోర శ్రీనివాస్, ఊరగొండ రాజు, ఆంకారపు రాజు, పంబరి అర్జున్, కోడం శ్రీనివాస్, రామలింగం, మురళి, గణేశ్, భాను తదితరులున్నారు.

నేతన్న కుటుంబానికి ఆర్థికసాయం చేయాలి

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న పరికిపెల్లి రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థికసాయం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రాజు మృతదేహాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాలతో పవర్లూమ్ కార్మికుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. వర్కర్ టూ ఓనర్ పథకాన్ని ప్రారంభించాలని, కార్మికులకు 10 శాతం యారన్ సబ్సిడీ పథకాన్ని అమలు చేయాలని కోరారు. టెక్స్‌టైల్ పార్కులో మూతపడిన పరిశ్రమలు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు.

బ్యాంక్ అధికారులపై ఫిర్యాదు

ఇల్లంతకుంట: బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు.. ఇల్లంతకుంట మండలం కందికట్కూరు గ్రామానికి చెందిన తోడేటి సత్తవ్వ 29 జనవరి 2024లో తెలంగాణ గ్రామీణ బ్యాంకులో బంగారం తాకట్టుపెట్టి రూ.1 లక్షా 25 వేలు రుణం తీసుకున్నట్టు ఆమె కొడుకు ప్రభాకర్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. లోన్ పీరియడ్ ముగిసిందని తీసుకున్న రుణం చెల్లించాలని ప్రభాకర్‌కు బ్యాంకు మేనేజర్ ఫోన్ చేయగా తన తల్లి ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై ఉందని, లోన్ కడతాను తమ బంగారం ఇవ్వాలని మేనేజర్‌కు చెప్పాడు. 18 ఫిబ్రవరి 2025లో రూ.1 లక్షా 40 వేలు చెల్లించాడు. అనంతరం బంగారం ఇవ్వాలని మేనేజర్‌ను అడిగితే బ్యాంకు గైడెన్స్ ప్రకారం లోన్ తీసుకున్న వ్యక్తికే ఇస్తామని చెప్పడంతో ప్రభాకర్, ఎస్సై శ్రీకాంత్ గౌడ్‌కు ఫిర్యాదు చేశాడు. ఈవిషయమై బ్యాంకు మేనేజర్‌ను వివరణ కోరగా, బ్యాంకు గైడెన్స్ ప్రకారం నడుచుకున్నానని, విషయాన్ని పై అధికారులకు తెలుపగా, రిప్లై వచ్చేలోగా బాధితురాలు మృతిచెందిందని తెలిపారు. మరణ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకువస్తే బంగారం తిరిగి ఇస్తామని పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బోయినపల్లి: కురుమ, గొల్ల సామాజిక వర్గాలు ఒకటి కాదని నిర్ధారించేలా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరుతూ జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కాలె నారాయణరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించారు. కురుమ బీసీ బీ వర్గానికి చెందగా, గొల్ల బీసీడీ వర్గానికి చెందినట్లుగా ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. రెండు సామాజిక వర్గాలు వేర్వేరు సామాజిక వర్గాలుగా గుర్తించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజం, కురుమ సంఘం నాయకులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• రెగ్యులర్ చేయాలి

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్లను వెట్టిచాకిరి నుంచి విముక్తి చేయాలని స్వీపర్స్, స్కావెంజర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మన్ కోరారు. దీర్ఘకాలికంగా చిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వీపర్లు, స్కావెంజర్స్‌కు ఏడాదికి రెండు జతల యూనిఫామ్స్ తదితర పనిముట్లు అందజేసి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

• పాదయాత్రను విజయవంతం చేయండి

చందుర్తి : రాజ్యాంగాన్ని కాలరాస్తూ అన్ని రంగాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ తీరును ఖండిస్తూ చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యంగా చేపడుతున్న పాయాత్రలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రతినిధి ఆవేజ్, మండల కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్ కోరారు. మండలకేంద్రంలోని పెరుక కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఏఐసీసీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ సన్నాహక సమావేశాన్ని కాంగ్రెస్ నాయకులతో నిర్వహించారు. ఏప్రిల్ 2 నుంచి మండలంలోని గ్రామగ్రామాన చేపట్టే రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

• బావుల చుట్టూ కంచె ఏర్పాటు

ఇల్లంతకుంట: మండలంలోని దాచారం రోడ్డుపక్కన ఇరువైపులా వ్యవసాయ బావులకు కంచె ఏర్పాటు చేశారు. రోడ్డు పక్కన ఈ బావులకు రక్షణ గోడలు లేవు. గ్రామంలో ప్రమాదకర బావులకు కంచె ఏర్పాటు చేయాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ రైతులకు సూచించారు. గ్రామ విలేజ్ పోలీస్ ఆఫీసర్ హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ రైతు రగుడు చంద్రయ్య వ్యవసాయ బావి చుట్టూ కంచె ఏర్పాటు చేయించారు.

• ఆరోగ్య కార్యక్రమాలు అమలుచేయాలి

కోనరావుపేట: ఆరోగ్య కార్యక్రమాలను వంద శాతం పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత అన్నారు. మంగళవారం మండలంలోని సుద్దాలలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యాధికారి వేణుమాధవ్, సిబ్బంది పాల్గొన్నారు.

• ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వేములవాడఅర్బన్: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వెంకటరమణ విద్యార్థులకు బ్యాంకింగ్, ఖాతాలు, బ్యాంకులు అందించే రుణాలపై వివరించారు. డబ్బులు ఆదా చేయడం అలవాటు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ మోసాలపై వివరించారు. ఎంఈవో బన్నాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

• పీహెచ్‌సీ సందర్శన

గంభీరావుపేట: గంభీరావుపేట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కాయకల్ప అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. ఆసుపత్రిలోని వసతులను పరిశీలించి, రోగులతో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. సందర్శించిన వారిలో వైద్యాధికారులు దేవేందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ సృజన్, వైద్యాధికారులు సుష్మ, సరా తదితరులు పాల్గొన్నారు.

• కరెంట్‌మోటారు, పైపులు చోరీ

చందుర్తి: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో రైతు ఎర్రవెల్లి రాజు వ్యవసాయ బావిలోని కరెంట్ మోటారు, పైపులను సోమవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జిల్లావాసులకు అవార్డులు

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లటౌన్: ఉగాది పండుగ సందర్భంగా తెలుగు వెలుగు సాహితీ వేదిక సారథ్యంలో హుస్నాబాద్‌లో వివిధ రంగాల నిపుణులకు అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం జరిగింది. జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్ అక్కపెల్లి యాదగిరిగౌడ్‌కు ఉత్తమ మిమిక్రీ ఆర్టిస్ట్‌గా అవార్డు ప్రదానం చేశారు. ప్రముఖ నటుడు ఆర్‌ఎస్ నంద, సీతామాలక్ష్మి చేతుల మీదుగా పురస్కారం యాదగిరి స్వీకరించారు. జిల్లాకు చెందిన ప్రముఖ గాయని, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తుమ్మనపల్లి శాంతకుమారికి (ఎస్‌ఏ తెలుగు) పురస్కారం అందజేశారు.

రాజన్న సేవలో పెద్దాపురం ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఆలయ పర్యవేక్షకులు

వేములవాడ : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని ఆంధ్రప్రదేశ్‌లోని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్నరాజప్ప మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం అర్చకులు వేదోక్త ఆశీర్వాదం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు వరి నర్సయ్య, ప్రోటోకాల్ పర్యవేక్షకుడు శ్రీకాంతాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు


వేములవాడఅర్బన్: కాయకల్ప కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేములవాడ ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో పట్టణంలో స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ, ప్రజలు తమ ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



వీర్నపల్లి: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అరుణ్ కుమార్ అన్నారు. మండలంలోని తెలంగాణ ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ తరలివెళ్లకుండా వీవోఏలను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీప్రకారం రూ.20వేల వేతనం ఇవ్వాలన్నారు. ఇక్కడ వీవోఏలు పద్మ, రాధ, జయశీల, మాధవి, విజయ, స్వప్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



చందుర్తి : మండలంలోని సనుగుల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మొక్కల పెంపకం, నీటి సంరక్షణపై మంగళవారం నిర్వహించిన చిత్రలేఖన పోటీలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు మొక్కల పెంపకం, నీటి సంరక్షణతో కలిగే ప్రయోజనాలపై చిత్రలేఖన పోటీలను నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు కట్కూరి ముఖేష్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేకల పద్మ, న్యాతరి నాగమణి, చింతల హరిష్మా, ఏగోలం మాధవి, యాస నవ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: చీకోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతుల గదులకు రంగులు వేయలేదు. నాలుగేళ్లుగా నిర్మిస్తున్న గదులు ఎట్టకేలకు గతేదాది పూర్తి చేయగా, ఇంకా అసంపూర్తి పనులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. పూర్తి సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : నిమ్మ రాజిరెడ్డి
ఎంఈవో, ముస్తాబాద్, సెల్‌నెంబర్:9866654974

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి



ఎల్లారెడ్డిపేటలో గోపిని సన్మానిస్తున్న ముదిరాజ్‌లు

ఎల్లారెడ్డిపేట: ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. మండలకేంద్రంలో ముదిరాజ్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిని ముదిరాజ్‌లు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, ఐక్యంగా ముందుకెళ్లాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, విద్యాలయాల్లో ముదిరాజ్‌లకు ప్రత్యేక కోటా కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు పెరుమాండ్ల అంజయ్య, ఉపాధ్యక్షుడు పరుస సత్తయ్య, కోశాధికారి బాలనర్సు, నాయకులు దేవయ్య, నారాయణ, సత్తయ్య, నాంపల్లి, లింగం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



ముస్తాబాద్‌లో ఆశా కార్యకర్తల నిరసన



కోనరావుపేటలో..

ఎల్లారెడ్డిపేట: తమ డిమాండ్ల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్తుండగా పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం మండలంలోని రాచర్లగొల్లపల్లి అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పనికి తగిన వేతనం ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆశాకార్యకర్తలు నిరసన తెలిపారు. తమకు రూ.18 వేల వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మండలంలోని పలుగ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలకేంద్రంలో ఆశా కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అన్నిగ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలకేంద్రంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రధాన రహదారిపై బైఠాయించి తమ డిమాండ్ల సాధనకోసం సాధన కోసం నినదించారు.

ముస్తాబాద్: మండలకేంద్రంలో ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు మంజుల మాట్లాడారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు జ్యోతి, అనురాధ, సరోజన, దేవిక, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆశాకార్యకర్తలు నిరసన తెలిపారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అరుణ్‌కుమార్, మద్దతు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్, ఆశా కార్యకర్తలు అనిత, రాణి, నవత, స్వప్న, జీవంతి, సిమా,తదితరులున్నారు.

నవోదయలో సీటు



శ్రీనిత రాథోడ్

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి తండా పాఠశాల విద్యార్థిని శ్రీనిత రాథోడ్ నవోదయ పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభచాటి సీటు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు తిరుపతి జాదవ్ తెలిపారు. శ్రీనిత తండ్రి గణపతి ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లగా, తల్లి లలిత ఇంటి వద్ద వ్యవసాయ పనులు చేస్తూ కూతుర్ని చదివిస్తోంది. ఈ సందర్భంగా శ్రీనితను మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్, ఉపాధ్యాయులు కావేరి, రజిత దేవి, సుమలత, వినీత, విద్యాకమిటీ చైర్మన్ లావణ్య, తల్లిదండ్రులు అభినందించారు.

తైబజార్ వేలం

ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీ తైబజార్ వేలానికి స్పందన లభించింది. ప్రత్యేకాధికారి, తహసీల్దార్ సురేశ్ ఆధ్వర్యంలో మంగళవారం తైబజార్ 2025–26కు నిర్వహణకు వేలం నిర్వహించారు. 8 మంది కాంట్రాక్టర్లు దరావత్తు చెల్లించి టెండర్‌లో పాల్గొన్నారు. గుండెల్లి రాములుగౌడ్ 5.50లక్షలకు వేలం పాడి దక్కించుకున్నారు. గతేడాది రూ.3.30లక్షలకు తైబజార్ నిర్వహించగా, ఈసారి రికార్డు స్థాయిలో తైబజార్ వేలం పాడారు. ఎనిమిది మంది పాల్గొన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో బీరయ్య, ఈవో రమేశ్, భిక్షపతి, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ముస్తాబాద్: పోతుగల్‌లో పేకాటస్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. సోమవారం రాత్రి ఓ ఇంట్లో పేకాటాడుతున్నారన్న సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకొని ఆరుగురి పై కేసు నమోదు చేశామన్నారు. వారినుంచి రూ. 8వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న నాయకులు

గంభీరావుపేట: రంజాన్ సందర్భంగా మండలకేంద్రంలోని జామా మసీద్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఎస్సై శ్రీకాంత్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణశాఖ అధ్యక్షుడు హమీద్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. తహసీల్దార్ సుజాత, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో సత్తయ్య, ఎస్సై రమాకాంత్, ఏఎంసీ చైర్‌పర్సన్ సాబేర బేగం, వైస్‌చైర్మన్ రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, తదితరులున్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్ ఇంట్లో..

నారాయణపూర్‌లోని ఏఎంసీ చైర్‌పర్సన్ సాబేర బేగం స్వగృహంలో అధికారులకు, నాయకులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. తహసీల్దార్ ముక్తార్ పాషా, ఎంపీడీవో వాజిద్ అబ్దుల్, ఏఎంసీ చైర్మన్ రాములు, సెస్ డైరెక్టర్ మల్లేశం, మాజీ కో ఆప్షన్ చాంద్‌పాషా, మాజీ ఎంపీటీసీ అరుణ్ కుమార్, ఆర్ఐ శివ కుమార్, ముస్లింలు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ ముక్తార్ పాషాను సన్మానించారు.